ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 277

పేజీలు : 5 వెల రూ. 2/-

ఆదివారం
01 ఫిబ్రవరి 2026

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## ఇది కాదా అహంకారం ?..
## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఆగ్రహం


2 లో

# నేడే కేంద్ర బడ్జెట్

సుస్థిరాభివృద్ధి, తయారీకి ప్రోత్సాహం
ద్రవ్య క్రమశిక్షణకు, సంస్కరణలకు
ప్రాధాన్యం దక్కుతాయని అంచనా
ఉద్యోగ కల్పనపై దృష్టి
వరుసగా తొమ్మిదోసారి ప్రవేశపెట్టనున్న నిర్మల


2 లో

# నిర్లక్ష్యం వద్దు

- ప్రతి డివిజన్..
  వార్డులో గెలుపు ముఖ్యం
- మంత్రులు, పార్టీ నేతలకు
  సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- అమెరికా నుంచి జూమ్‌లో
  మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష
- 4 నుంచి ముఖ్యమంత్రి
  బహిరంగ సభలు..

2 లో



# ముగిసిన మహా జాతర

- ఉద్వేగ భరితం... సమ్మక్క వన ప్రవేశం - పూజారులు, భక్తులతో కలిసి నడిచిన మంత్రి సీతక్క


2 లో

# రండి.. విచారణకు..!

- సిట్ నోటీసులు చట్టవిరుద్ధం,
  రాజ్యాంగ వ్యతిరేకం! అయినా సహకరిస్తా!
- నేడు నందినగర్‌లో అందుబాటులో ఉంటా!
- విచారణాధికారికి మాజీ సీఎం కేసీఆర్ లేఖ
- నోటీసుల జారీలో సుప్రీం మార్గదర్శకాల ఉల్లంఘన
- సిట్ అధికారుల తీరు కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది
- నా వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా చర్యలు
- 65 ఏండ్లు పైబడినవారిని నివాసం వద్దే విచారించాలి
- సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాల్లో చెప్పిందిదే!
- ఎన్నికల అఫిడవిట్‌లోని అడ్రస్‌కు, సెక్షన్-160 కింద
- నోటీసులు ఇచ్చే చిరునామాకు సంబంధం లేదు
- అక్రమ పద్ధతిలో ఇచ్చిన నోటీసులను విస్మరించవచ్చు
- కానీ, బాధ్యతగల పౌరుడిగా, మాజీ సీఎంగా సహకరిస్తా
- ఆదివారం సిట్ విచారణకు సిద్ధం.. కేసీఆర్ స్పష్టీకరణ
- మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపనున్న సిట్
- పోలీసుల ద్వంద్వ వైఖరిపై తెలంగాణవాదుల ఆగ్రహం
- నిరసనల నేపథ్యంలో భారీగా బలగాల మోహరింపు
- నందినగర్ ఇల్లు, తెలంగాణభవన్‌కు ఐదంచెల భద్రత

2 లో




## గంజాయి అక్రమ రవాణాపై
## పోరాడి.. మృత్యు ఒడికి

నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్ కన్నుమూత


2 లో

# నిర్లక్ష్యం వద్దు

**హైదరాబాద్:**
మున్సిపల్ ఎన్నికల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా గెలిచే సత్తా ఉన్నవారిని ఎంపిక చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలకు, మంత్రులకు సూచించారు. శనివారం అమెరికా నుంచి జూమ్‌లో పార్టీ ముఖ్య నేతలతో ఆయన ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ... "సామాజిక సమతౌల్యం, గెలుపు, విధేయతలను ప్రామాణికంగా తీసుకుని మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేయాలి. వ్యక్తిగత ఇష్టాలు, ఒత్తిళ్లలో పార్టీ టికెట్లు కేటాయించవద్దు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు ముఖ్యం. అందుకు అనుగుణంగా గెలుపు గుర్రాలను గుర్తించాలి. భారాస, భాజపా అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్టీ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జులంతా దృష్టిపెట్టాలి.
ప్రధానంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడం, నాయకులు సమన్వయంతో పనిచేయడం లాంటి అంశాలను ముఖ్య నేతలు పర్యవేక్షించాలి. ప్రతిపక్షాల ఎత్తులకు పైఎత్తులతో ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ యంత్రాంగమంతా సిద్ధంగా ఉండాలి. గత ఎన్నికల ఫలితాలను పరిశీలించి బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలు, వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రభుత్వ పథకాల వివరాలను ఇంటింటికి వివరించాలి. లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, మంత్రులు.. నాయకుల మధ్య అంతరం లేకుండా చూడాలి. బరిలో రెబెల్స్‌ను విరమింపజేసేందుకు ప్రతి ఒక్కరితో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి" అని చెప్పినట్లు పార్టీ వర్గాలు వివరించాయి. 'సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకుంటారు. సోమవారం నుంచి అందుబాటులో ఉంటారు. 4వ తేదీ నుంచి 9 వరకు ఎన్నికల బహిరంగసభల్లో పాల్గొని ప్రసంగిస్తారు' అని పార్టీ నేతలు వివరించారు. ఈ నెల 4న మిర్యాలగూడ, 5న చొప్పదండి, 6న నిజామాబాద్, 7న పరిగి, 8న భూపాలపల్లి, 9న మెదక్‌లలో బహిరంగసభలు ఉంటాయని తెలిపారు. ఒక్కో సభకు కనీసం లక్షమంది వరకు హాజరయ్యేలా చూడాలని పార్టీ యోచిస్తోంది.
తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలో నిలవకుండా..
ఎన్నికల్లో తమకే టికెట్ వస్తుందని కాంగ్రెస్ పేరుతో పెద్దసంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేసినందున బీ-ఫారాల పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఇన్‌ఛార్జి మంత్రులతో పంపిణీ చేయించాలని పీసీసీ నిర్ణయించింది. టికెట్ రానివారు గొడవలకు దిగకుండా, తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలో నిలవకుండా ముందుగానే వారితో చర్చించాలని స్క్రీనింగ్ కమిటీలకు సూచించింది. నిజంగా ప్రజల్లో బలమున్నవారు ఎవరనేది సర్వే ద్వారా గుర్తించి కమిటీ సమావేశంలో చర్చించాలని నిర్దేశించింది. ఆది, సోమవారాల్లో అభ్యర్థుల గుర్తింపు కార్యక్రమాలన్నీ పూర్తిచేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని కమిటీలకు సూచించింది. ప్రతి వార్డు లేదా డివిజన్ గెలుపును కమిటీ వ్యక్తిగత ప్రతిష్ఠగా భావించి బీ-ఫారాల పంపిణీ చేయాలని ఆదేశించింది.

# గంజాయి అక్రమ రవాణాపై పోరాడి.. మృత్యు ఒడికి

నిమ్స్, అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం లెక్కచేయలేదామె. ఆ ప్రయత్నంలో తీవ్రంగా గాయపడ్డారు. మృత్యువుతో పోరాడి చివరికి ఓడిపోయారు. నిజామాబాద్‌లో జనవరి 23న గంజాయి అక్రమ రవాణాదారులు.. వాహనంతో ఢీకొట్టి, తొక్కించేసిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య(25) పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. సౌమ్యను తొలుత నిజామాబాద్‌లోనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్సలో భాగంగా అక్కడే ఓ కిడ్నీని తొలగించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం అందించేందుకు జనవరి 25 అర్ధరాత్రి నిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ఆర్ఐసీయూలో చేర్చుకొని వైద్యం అందించారు. అత్యవసర విభాగం, నెఫ్రాలజీ, కార్డియాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాల ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో వెంటిలేటర్‌పై చికిత్స అందించారు.
వైద్యులు శ్రమించినా... సౌమ్య పరిస్థితిపై మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఇతర ప్రముఖులు ఆరా తీస్తూ ఆమె కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమెను కాపాడేందుకు వైద్యబృందం తీవ్రంగా శ్రమించినా ఫలితం దక్కలేదు. 2024 బ్యాచ్ కానిస్టేబుల్ జి.సౌమ్య స్వగ్రామం నిజామాబాద్ జిల్లాలోని మోస్రా మండల కేంద్రం. ఆమె తల్లిదండ్రులు మసాలా దినుసులు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. కుమార్తెను కష్టపడి చదివించారు. ఎక్సైజ్ శాఖలో చేరి.. సుమారు ఏడాది కాలంలోనే సౌమ్య దుండగుల దౌర్జన్యానికి బలైపోయారు.

# నేడే కేంద్ర బడ్జెట్

దిల్లీ: సుస్థిరాభివృద్ధిని కొనసాగిస్తూ.. సంస్కరణలను పరుగులు పెట్టించే లక్ష్యంతోపాటు అంతర్జాతీయ ఒత్తిడులను, సుంకాలను తట్టుకునే చర్యలకు ప్రాధాన్యమిస్తూ 2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించనున్నారు. వరుసగా తొమ్మిదోసారి ఆమె బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆదివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటం ఇదే తొలిసారి.
దేశీయ డిమాండులో స్తబ్ధత, ద్రవ్యోల్బణం గరిష్ఠాల నుంచి ఓ మాదిరి స్థాయికి చేరడం, అంతర్జాతీయ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, కమాడిటీ రేట్లలో హెచ్చుతగ్గులు, ప్రధాన బ్యాంకుల ద్రవ్య లభ్యతలో అసమానతల వంటివి బడ్జెట్ అంచనాలపై ప్రభావం చూపే అవకాశముంది.
స్థానికంగా వినియోగాన్ని పెంచాల్సిన ఒత్తిడిని ప్రభుత్వం ఎదుర్కొంటోంది. ఉపాధి అవకాశాలనూ పెంచాల్సి ఉంది. ద్రవ్యలోటును తగ్గించాల్సి ఉంది.
అంతర్జాతీయ అనిశ్చితి కారణంగా తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో సరికొత్త అభివృద్ధి పథాన్ని ఆవిష్కరించడం ఆర్థిక మంత్రికి అతి పెద్ద సవాలే.
అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించడం కఠిన పరీక్షే. రూపాయి పతనం కారణంగా విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లో అమ్మకాలు జరుపుతున్నారు.
పెట్రో ఆదాయంపై ఆధారపడతారా.. ప్రభుత్వానికి పాలిచ్చే ఆవులా మారిన పెట్రో రంగాన్నే మళ్లీ ఆదాయం పెంచుకోవడానికి ఆర్థిక మంత్రి నిర్మల ఎంచుకుంటారా అనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. అయితే అంతర్జాతీయంగా పెట్రో ధరలు పెరుగుతుండటంతో ఈ రంగంలోనూ పరిమిత అవకాశాలే ఉన్నాయంటున్నారు. డీజిల్, పెట్రోలుపై ఎక్సైజ్ సుంకాన్ని పెంచే అవకాశముంది. నిబంధనలను సరళీకరించి నిర్మాణాత్మక సంస్కరణల ద్వారా దేశీయ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ఆర్థిక మంత్రి ప్రాధాన్యమిచ్చే అవకాశముంది.
ఆర్థిక ఒత్తిడులున్నా వ్యయాల విషయంలో వెనక్కి తగ్గకపోవచ్చని అంటున్నారు. ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాంలకు కొత్త పథకాలను ప్రకటించవచ్చు.
మూల ధన వ్యయాన్ని పెంచే చర్యలు చేపట్టవచ్చు. రైల్వేలు, పునరుత్పాదక ఇంధన వనరులు, విద్యుత్తు పంపిణీ, రక్షణ, పట్టణ రవాణా రంగాలకు ప్రాధాన్యం దక్కే అవకాశముంది. చిన్నపరిశ్రమల ప్రోత్సాహకానికి క్రెడిట్ గ్యారంటీ కేటాయింపులను పెంచవచ్చు. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజీ, విద్యుత్తు రవాణా, దేశీయంగా శుద్ధ ఇంధనపరికరాల తయారీకి ప్రాధాన్యం లభించవచ్చు.
పన్నుల్లో భారీ మార్పులు ఉండకపోవచ్చని అంటున్నారు. కార్పొరేట్ పన్నులను పెద్దగా కదిలించకపోవచ్చు. వినియోగాన్ని పెంచేందుకు వ్యక్తిగత ఆదాయ పన్నులో స్వల్ప ఊరట కల్పించవచ్చని భావిస్తున్నారు.
వరుసగా రికార్డు.. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది తొమ్మిదోసారి. ఇప్పటివరకూ మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ అత్యధికంగా 10 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అయితే ఆయన వరుసగా ప్రవేశపెట్టలేదు. వేర్వేరు సమయాల్లో అందించారు. మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం మొత్తం 9 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. కానీ ఆయన వరుసగా చేయలేదు.
నిర్మలా సీతారామన్ మరోఅరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఆమె 2019 మే 31న ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2026 జనవరి 31 నాటికి ఆమె ఈ పదవిలో 6 ఏళ్ల 8 నెలలు పూర్తి చేసుకున్నారు. గతంలో సి.డి.దేశ్‌ముఖ్ ఆరేళ్ల రెండు నెలలపాటు నిరంతరాయంగా ఆర్థిక మంత్రిగా పనిచేశారు.



బడ్జెట్ అంకెలు తర్వాత మారిపోతాయా?.. కొత్త స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) విలువలు, వినియోగ వస్తు ధరల సూచీలు బడ్జెట్ ప్రవేశపెట్టిన కొన్ని రోజుల తరువాత విడుదల కానున్న నేపథ్యంలో బడ్జెట్‌లో ప్రస్తావించనున్న అంకెలు ఆ తర్వాత మారిపోతాయా అని కాంగ్రెస్ శనివారం ప్రశ్నించింది. ఈ పరిస్థితి విధాన రూపకల్పనలో మోదీ ప్రభుత్వ సమన్వయ రాహిత్యాన్ని తెలియజేస్తోందని ఆ పార్టీ పేర్కొంది. బడ్జెట్‌లో ప్రస్తావించే అనేక గణాంకాలను జీడీపీలో అవి ఎంత శాతమన్న ప్రాతిపదికన పేర్కొంటారని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

# ముగిసిన మహా జాతర

**మేడారం:**
గద్దెపై కొలువై మేడారంలో మూడు రోజులపాటు పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల మధ్య పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం రాత్రి నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మను సాగనంపే క్రతువులో గిరిజన సంగీత వాయిద్యాల చప్పుళ్లకు, కొమ్ముబూరల శబ్దాలకు భక్తులు నృత్యాలు చేశారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మిగతా గద్దెలపై పూజలందుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను సైతం ఆయా గొట్ల పూజారులు తమ ప్రాంతాల్లోని ఆలయాలకు తీసుకెళ్లారు. ఆదివాసీ పూజారులు సమ్మక్కను గద్దె నుంచి తీసుకొని చిలకలగుట్టకు చేర్చే వరకు దారిపొడవునా భక్తులు వెంటనడిచారు. మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సహా పలువురు ఉన్నతాధికారులు వనప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. మరోవైపు సారలమ్మను రాత్రి సమయంలో కన్నెపల్లి, గోవిందరాజును ఏటూరునాగారం మండలం కొండాయికి చేర్చారు. పగిడిద్దరాజు కూడా రాత్రి సమయంలో బయలుదేరినా... మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని గుడిలోకి ఆదివారం ఉదయం ప్రవేశం చేయించనున్నారు.
నాలుగో రోజూ భక్తుల రద్దీ
శనివారం ఉదయం నాటికి రద్దీ కొంతమేరకు తగ్గిపోయింది. భక్తులు నేరుగా గద్దెల వద్దకు చేరుకొని వన దేవతలను దర్శించుకున్నారు. అయితే, వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి రావాల్సిన వేల సంఖ్యలో వాహనాలు శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. దీంతో శనివారం మధ్యాహ్నం తర్వాత మళ్లీ క్యూలైన్లు నిండుగా మారాయి.
జాతరలో మొక్కుల సమర్పణ తర్వాత శుక్రవారం సాయంత్రం బస్సులు, సొంత వాహనాల్లో వెనుదిరిగిన భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుని రాత్రంతా వాహనాల్లోనే నానాఅవస్థలు పడ్డారు. మేడారం-తాడ్వాయి(13 కిలో మీటర్లు), తాడ్వాయి-పస్రా (20 కిలోమీటర్లు) మార్గాల్లో వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. అర్ధరాత్రిలోపే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన వాహనాలు ఉదయం 8 గంటలకుగానీ చేరలేదు. హనుమకొండ నుంచి మేడారానికి మూడు గంటల్లో రావాల్సిన భక్తులకు ఏకంగా పది గంటల సమయం పట్టింది. ఈ క్రమంలో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురై



ములుగు సమీపంలో ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. రోడ్ల విస్తరణ చేపట్టామని, ఏఐను వినియోగించి యాప్ ద్వారా ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెడతామని అధికారులు చెప్పినా... శనివారం మధ్యాహ్ననికిగానీ సమస్య తొలగలేదు.
గద్దెల వద్ద రద్దీ నియంత్రణలోనూ విఫలం
మేడారంలోని గద్దెల ప్రాంగణం, క్యూలైన్లను విస్తరించామని, ఈసారి ఏకకాలంలోనే ఎక్కువ మంది భక్తులు దర్శించుకుంటారని, తోపులాటలు ఉండబోవని అధికారులు జాతర ముందు నుంచి చెబుతూ వచ్చారు. అయితే, వారు చెప్పిన మాటలకు వాస్తవ పరిస్థితులకు పొంతన కుదరలేదు. గద్దెల ప్రాంగణానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన గేట్లకు తాళాలు వేసి అవసరమైన సందర్భాల్లో తీయకపోవడంతో తోపులాట చోటుచేసుకొని కొందరు భక్తులు గాయపడ్డారు. పోలీసు, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉండి పర్యవేక్షిస్తుంటే... కిందిస్థాయి సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి సమస్య రాకుండా చేసేవారు. అయితే, పర్యవేక్షణ విధుల్లో ఉండే వారంతా ఉన్నతాధికారుల సేవలకు ప్రాధాన్యమిచ్చి... కిందిస్థాయి సిబ్బందిని వదిలేశారనే విమర్శలున్నాయి.

# ఇది కాదా అహంకారం ?..
# రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఆగ్రహం

## రాత్రివేళ గేటుకు నోటీసు అతికించి పైశాచికానందం పొందడం దారుణం
## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఆగ్రహం
## కాంగ్రెస్ కక్షసాధింపులో భాగమే
## కేసీఆర్‌కు నోటీసులు: సిరికొండ
## రాజకీయంగా ఎదుర్కోలేకే
## బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు: జగదీశ్‌రెడ్డి
## ఇది సర్కారా? సర్కసా?: తలసాని
## తెలంగాణ క్షమించదు: సబిత
## నోటీసులు కుట్రపూరితం: ప్రవీణ్

హైదరాబాద్, జనవరి 31 :
'తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరేంది రేవంత్‌రెడ్డీ?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ స్వయంగా తానుంటున్న నివాసం అడ్రస్ సహా పోలీసులకు సమాధానం ఇచ్చాక కూడా ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గేటుకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణమని మండిపడ్డారు. ఇది అహంకారం కాకుంటే మరేమిటి? అని నిలదీశారు. 65 ఏండ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దనే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని ఆక్షేపించారు.
'అసలు మీ పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉన్నదా? లేక మీ చేతిలో కీలుబొమ్మల్లా ఇట్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? చట్టం, న్యాయం, ధర్మం మీద మీకు గౌరవం లేకపోవచ్చు. కానీ మాకు వాటిమీద పూర్తి విశ్వాసం ఉన్నది. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తాం. మీ ప్రతి తప్పుడు పనినీ వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడుతాం. మీరెన్ని వేధింపులకు పాల్పడుతున్నారో ప్రజలు గమనిస్తున్నరు. సమయం వచ్చినప్పుడు తప్పకుండా మీకు ప్రజాక్షేత్రంలో వారు బుద్ధి చెప్తరు' అని శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.
బీఆర్ఎస్‌లో చేరిన ఇంద్రసేనారెడ్డి
నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలో బీజేపీకి గట్టి దెబ్బ తగిలింది. సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నేతృత్వంలో బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు రికాల ఇంద్రసేనారెడ్డి తన అనుచరులతో కలిసి శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో ఇంద్రసేనారెడ్డికి బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ కండువా కప్పి ఆత్మీయంగా ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో బలం ఉన్న నేత పార్టీలోకి రావడం వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ మరింత బలోపేతమవుతుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పని విజయసింహారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ గుజ్జ దీపికా యుగేంధర్‌రెడ్డి, ఆపాబ్ మాజీ చైర్మన్ ఎడవెల్లి విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# బంగారం ధరల్లోఒడిదుడుకులు

## ఒక్కరోజులోనే
## 5లక్షల కోట్లకు క్రాష్
## సాయంత్రానికి తిరిగి పుంజుకున్న మార్కెట్

న్యూఢిల్లీ,జనవరి31:
ప్రస్తుతం ఎక్కడ చూసినా బంగారం, వెండి ధరలపై చర్చ సాగుతోంది. అనూహ్యంగా అడ్డూఅదుపుల లేకుండా పెరుగుతున్న ధరలు ఎందాక పోతాయా అన్న ఆందోళన కనిపిస్తోంది. సామాన్యుల నుంచి బడా ఇన్వెస్టర్లు, వ్యవస్థాగత మదుపర్ల వరకూ అన్ని వర్గాల వారినీ పసిడి ధరల పరుగు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ రోజు ధర ఎంత పెరుగుతుందో? ఎంత తగ్గుతుందో? అసలు పసిడిపై పెట్టుబడికి ఇది సరైన సమయమో కాదో తెలియక సామాన్యుల తలకిందులవుతున్నారు. అయితే, చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గురువారం బంగారం మార్కెట్ విలువ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైంది. అంతర్జాతీయ అనిశ్చితులతో గత కొన్ని రోజులుగా అసాధారణంగా పెరుగుతున్న బంగారం ధర.. గురువారం రాత్రి అనూహ్యంగా ఒడుదొడులకు లోనై,గంటల వ్యవధిలో దారుణంగా ఊగిసలాడింది. కేవలం
ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే పసిడి మార్కెట్ విలువ ఏకంగా 5.5 ట్రిలియన్ డాలర్ల హెచ్చుతగ్గులకు గురైందంటే.. ప్రపంచ కమొడిటీ మార్కెట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..! ఒక్క రోజులో బంగారం మార్కెట్ విలువ ఈ స్థాయిలో మార్పులు రావడం చరిత్రలో ఇదే తొలిసారి. ని స్టాక్ మార్కెట్ వ్యవహారాల కామెంటరీ వేదిక 'ది కొబేసీ లెటర్' నెట్టింట పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ది కొబేసీ లెటర్' చేసిన ట్వీట్ ప్రకారం, గురువారం ఉదయం అమెరికా కాలమానం ప్రకారం 9.30 గంటల నుంచి 10.25 గంటల మధ్య బంగారం మార్కెట్ విలువ ఒక్కసారిగా 3.2 ట్రిలియన్ డాలర్ల మేర పడిపోయింది. ఆ తరువాత క్రమంగా కోలుకుని మార్కెట్స్ క్లోజ్ అయ్యే సమయానికి కనిష్ఠ స్థితి నుంచి 2.3 ట్రిలియన్ డాలర్ల మేర ఎగబాకింది. అంటే.. ఒక్క సెషన్‌లోనే బంగారం మార్కెట్ క్యాపిటలైజేషన్ హెచ్చుతగ్గుల విలువ 5.5 ట్రిలియన్ డాలర్లను చేరింది. బంగారానికి ఉన్న వాస్తవ డిమాండ్‌కు మించి ధరల్లో ప్రస్తుతం హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. భౌగోళిక అనిశ్చితులు, డాలర్ బలహీనత, అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి వంటి వాటితో పాటు ఇతర కీలక అంశాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా వ్యవస్థాగత మదుపర్లు కమోడిటీ మార్కెట్స్‌పై దృష్టిపెట్టడం, అల్గోరిథమ్-ఆధారిత ట్రేడింగ్ పెరగడం, బంగారం హెచ్చుతగ్గుల ఆధారంగా డెరివేటివ్ మార్కెట్స్‌లో కూడా ట్రేడింగ్ అధికమవడంతో పసిడి ధరలు అంచనాలకు మించి హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి.
పసిడితో పాటు వెండి, ఎ÷-లాటినమ్, పెలాడియం వంటి విలువైన లోహాలన్నీ ఇదే స్థాయిలో ఒడిదుడుకులకు లోనుకావడం కమోడిటీ మార్కెట్స్‌లో ఒత్తిడికి సూచిక అని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా బంగారం ధరలకు ఈ ఏడాది బ్రేకులు ఉండకపోవచ్చని ప్రముఖ కన్‌స్టలెన్సీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్స్‌లో ఔన్స్ మేలిమి బంగారం ధర 6 వేల డాలర్ల మార్కు దాటొచ్చనేది మెజారిటీ మార్కెట్ విశ్లేషకుల అంచనా. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్యయుద్ధాల నేపథ్యంలో కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలు, ద్రవ్యోల్బణ భయాలు, వడ్డీరేట్లపై అస్పష్టత వంటి అనేక కారణాలతో ఈ మధ్య మదుపర్లు బంగారం, వెండి లోహాల్లో పెట్టుబడులను సురక్షిత సాధనంగా భావించారు. దీంతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. అయితే, గరిష్ఠాల వద్ద సంస్థాగత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో గురువారం వీటి విలువ ఒక్కసారిగా తగ్గింది. దీనికితోడు కంప్యూటర్ ఆధారిత ఆటోమెటిక్ అల్గారిథమ్ ట్రేడింగ్ కూడా ధరల కదలికలను తీవ్రంగా ప్రభావితం చేసిందని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. నేటి రోజుల్లో బంగారం ట్రేడింగ్ అనేది భౌతిక బంగారం డిమాండ్ మీద మాత్రమే ఆధారపడట్లేదని, ఈటీఎఫ్‌లే మార్కెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు.

# రండి. విచారణకు..!

**ఏఎం న్యూస్, హైదరాబాద్, జనవరి 31 :**
రాజకీయ దురుద్దేశంతో పెట్టిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు అక్రమ పద్ధతిలో తనకు నోటీసులిచ్చి.. సాక్షిగా విచారించేందుకు పట్టుబట్టి మరీ ఉవ్విళ్లూరుతున్న స్పెషల్ సిట్‌కు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆహ్వానం పలికారు. నేడు బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసంలో తనను విచారించుకోవచ్చని శనివారం అంగీకారం తెలిపారు. ఈ మేరకు సిట్ విచారణాధికారి పీ వెంకటగిరికి లిఖితపూర్వకంగా సమాధానం పంపారు. తెలంగాణ సాధకుడిగా, ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా, పోరాడి సాధించుకున్న రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా తనకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన గౌరవాన్ని పోలీసులు విస్మరించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు.
చట్టపరిధిలోని అంశాలను పాటించకుండా దురుద్దేశంతో ఇచ్చే నోటీసులకు తాను హాజరుకావాల్సిన అవసరం లేదని ఉటంకించారు. తనకు నోటీసు ఇచ్చే అధికారం సిట్ అధికారులకు లేదని చెప్పారు. అక్రమ పద్ధతిలో, చట్టాలను అతిక్రమించి ఇచ్చిన నోటీసులతో తనకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమేనని అభిప్రాయపడ్డారు. నోటీసులు ఇవ్వడంలో సిట్ అధికారులు పాటిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను, విపరీత ధోరణిని ఎండగట్టారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా, బాధ్యతాయుతమైన పౌరుడిగా,మాజీ ముఖ్యమంత్రిగా, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడిగా సిట్ దర్యాప్తునకు సహకరించాలనినిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. నందినగర్ నివాసంలోనే కేసీఆర్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేయాలని సిట్ పట్టుబట్టినందున అకడే అందుబాటులో ఉంటానని అంగీకారం తెలిపారు. దీంతో నేడు మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్‌లో సిట్ అధికారుల విచారణ ఉండనున్నది.
అడుగడుగునా హక్కుల కాలరాత
తెలంగాణ సాధకుడిగా, తెలంగాణ అంతా జననేతగా పిలుచుకునే కేసీఆర్‌కు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వడంతో స్పెషల్ సిట్ అత్యుత్సాహం ప్రదర్శించింది. రాష్ట్రానికి పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి అని తెలిసి కూడా అక్రమంగా పెట్టిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన్ను సాక్షిగానే విచారిస్తున్నారనే విజ్ఞత మర్చిపోయి ప్రవర్తించింది. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కేసీఆర్ లేని ఇంటికి నోటీసులు అంటించి వెళ్లడం ఆక్షేపనీయమని తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 65 ఏండ్లు పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 సీపీఆర్పీసీ నిబంధనలను కూడా సిట్ తుంగలో తొక్కుతూ తమకు అనుకూలంగా ప్రత్యుత్తరమిచ్చిందని మండిపడుతున్నారు.
ఎలక్షన్ అఫిడవిట్ అంటూ నోటీసుల్లో పేర్కొన్న సిట్ అధికారులు.. అదే పద్ధతిని హరీశ్‌రావు విషయంలో ఎందుకు పాటించలేదని నిలదీస్తున్నారు. హరీశ్‌రావు అఫిడవిట్‌లో సిద్దిపేట చిరునామా ఉన్నా హైదరాబాద్‌లో నోటీసు ఇచ్చారని, ఇది సిట్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని తేల్చి చెప్తున్నారు. దీంతో పాటు ఇచ్చే నోటీసుల్లో కూడా కేవలం గజ్వేల్ ఎమ్మెల్యే అని రాయడం, కేసీఆర్ మాజీ సీఎం అని ప్రస్తావించకపోవడం కూడా సిట్ విపరీత ధోరణికి అద్దం పడుతున్నదని ఫైర్ అవుతున్నారు. సిట్ అధికారుల తీరు ఇలా ఉంటే.. వారి విచారణలో రాజకీయ దురుద్దేశం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని చెప్తున్నారు.
భారీగా బలగాల మోహరింపు
కేసీఆర్‌ను ఎలాగైనా నందినగర్ రప్పించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్న సిట్ అధికారులు.. ఆ మేరకు బందోబస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కేసీఆర్‌కు మొదటిసారి నోటీసులిచ్చే ముందే పలు దఫాలుగా బందోబస్తు ఏర్పాట్లపై రహస్యంగా చర్చలు జరిపారు. అనంతరం ఇచ్చిన నోటీసుల తర్వాత మరోసారి చర్చించిన సిట్ అధికారులు వేలాదిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, కేసీఆర్ సానుభూతిపరులు వచ్చే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. ఈ మేరకు హైదరాబాద్ సిటీ పరిధిలోని పోలీస్ ఫోర్స్‌తోపాటు, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పించారు. ఆదివారం తెలంగాణవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు శాంతియుతంగా నిరసనలు చేపట్టాలని, వేలాదిగా కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలిరావాలని పిలుపునివ్వడంతో బెటాలియన్స్‌ను కూడా రంగంలోకి దించుతున్నారు.
ఐదంచెల భద్రతలో నందినగర్
విచారణకు కేసీఆర్ సిట్‌ను ఆహ్వానించిన నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో అన్ని చోట్లా పాక్షికంగా.. బంజారాహిల్స్ మొత్తం పోలీస్ ఫోర్స్‌తో నింపనున్నారు. తెలంగాణ భవన్, నందినగర్, కేబీఆర్ పార్క్, ఖైరతాబాద్, సిటీ సెంటర్, మెహిదీపట్నం, నాంపల్లి, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వంటి ప్రాంతాల్లో భారీగా పోలీసులతో మోహరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. నంది నగర్‌లో ఐదంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నారు. విచారణకు ఆటంకం ఏర్పడకుండా తెలంగాణ భవన్, బంజారాహిల్స్, నందినగర్ వైపు వెళ్లే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు పెట్టనున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ తరలివచ్చే బీఆర్ఎస్ నేతలను ముందస్తుగానే అరెస్టు చేసే అవకాశాలున్నాయి. కొందరు బీఆర్ఎస్ కీలక నేతల ఇండ్ల వద్ద పోలీస్ బలగాలను బందోబస్తుకు దించుతున్నారు. ఈ మేరకు బందోబస్తు ఏర్పాట్లపై డీజీపీ శివధర్‌రెడ్డి, లా అండ్ ఆర్డర్ మహేశ్ భగవత్, సిటీ కమిషనర్ సజ్జనార్ రహస్యంగా సమీక్షించారు. రాజకీయ దురుద్దేశంతో కొనసాగుతున్న ఈ విచారణకు వారికి అనుకూలమైన ప్రశ్నావళితో స్పెషల్ సిట్ అధికారులు సిద్ధమయ్యారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ. 2.2 కోట్ల ప్రతిభా పురస్కారాలు

## - చదువుకో తెలంగాణ -శ్రీరామ్ లైఫ్ మిషన్ 10వ క్లాస్ ప్రారంభం

ఏ ఎం న్యూస్, ఓయూ:

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 'చదువుకో తెలంగాణ - శ్రీరామ్ లైఫ్ మిషన్ 10వ క్లాస్' అనే మెగా ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతదేశంలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం చేపడుతున్న అతిపెద్ద ప్రోత్సాహక కార్యక్రమంగా ఇది నిలవనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ కోదండరాం జనవరి 31, 2026న ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం రూ. 2.2 కోట్ల వరకు నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నారు. రాష్ట్ర స్థాయి ప్రభుత్వ పాఠశాల టాపర్‌కు రూ.5 లక్షలు, రెండో టాపర్‌కు రూ.3 లక్షలు, ప్రతి జిల్లా




టాపర్‌కు రూ.2 లక్షలు, ప్రతి నియోజకవర్గ టాపర్‌కు రూ.1 లక్ష, ప్రతి మండల టాపర్‌కు రూ.10,000 నగదు బహుమతులు అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్, ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న 6,000కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 3.30 లక్షల మంది 10వ తరగతి విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంది. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడటానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వచ్చే రెండు నెలలు విద్యార్థులు కష్టపడి చదివి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ చిట్స్ హైదరాబాద్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జె. భాస్కర్, డీజీఎంలు ఎన్. మురళి, కె. రాజశేఖర్, ఎల్. వెంకట కృష్ణ, డివిజనల్ మేనేజర్ పీ. సతీష్, సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్. జస్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






## విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకత వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు

### - కరస్పాండెంట్ జె.కమలాకర్ రావు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయనీ శ్రీ నాగార్జున విద్యాలయ హై స్కూల్ కరస్పాండెంట్ జె. కమలాకర్ రావు పేర్కొన్నారు. మాధవరం కాలనీలోని శ్రీ నాగార్జున విద్యలయ హై స్కూల్ లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ కమలాకర్ రావు, ప్రిన్సిపాల్ అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమలాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని తెలియజేశారు. నర్సరీ నుండి మొదలుకొని పదోతరగతి వరకు విద్యార్థులు వివిధ రకాల వైజ్ఞానిక ప్రదర్శనలు పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## యువ భారతం దేశ భవిష్యత్తుకు ఆశాకిరణం

ఏ ఎం న్యూస్ ఓయూ:




Young India young leadership (ONE STOP SOLUTION FOR YOUTH) ఎన్జీవో ఆర్గనైజేషన్ 16వ సమావేశం వాగ్దేవి జూనియర్ కళాశాల భువనగిరిలో జరిగింది.దీనిలో భాగంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చావా రాజ్ కుమార్ మాట్లాడుతూ Lead Today change Tomorrow అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న సంస్థ, మీ ఆలోచనలు సకారం చేసే ఇది ఒక చర్చ వేదిక young India young leadership యువభారతం రాబోవు రోజుల్లో దేశ భవిష్యత్తు కు ఆశ కిరణం అనీ మీ శక్తి కి మీ ఆశయానికి మేము దిక్సూచి అవుతాం అని అన్నారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన భువనగిరి టౌన్ సీఐ రమేష్ మాట్లాడుతూ కొత్తగా ఆలోచించండి, కొత్త తరానికీ మార్గాన్ని ఇవ్వండి పెద్ద లక్ష్యం ఎంచుకొని కృషిచేసి కొత్త నవతారాన్ని నిర్మించండి అని డ్రగ్స్ వద్దు. మీ ఆరోగ్యం ముద్దు అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ మనది యువ భారతదేశం ఈ రోజులలో యువత సరికొత్త ఆలోచనలు మన దేశ అభివృద్ధికి తోడ్పడతా యని పేర్కొనడం. కళాశాల ఉపన్యాసములు p s రెడ్డి మాట్లాడుతూ యువత నిరంతరం శ్రమిస్తూ నవ తరాన్ని సృష్టించాలి అన్నారు ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మహేశ్వర్ గౌడ్ .వైస్ ప్రెసిడెంట్ అంభోజు మల్లేశం జాయింట్ సెక్రెటరీ యేంపాల కొండల్ రెడ్డి సార్ ట్రెజరీ వెంకట్ రాజు గౌడ్ సార్, జాయింట్ డైరెక్టర్ శ్రవణ్ కుమార్ గాజుల వెంకటేష్ గౌడ్, శ్రవణ్ రెడ్డి ,సంపత్ కుమార్ గౌడ్, సంతోష్ గౌడ్ కళాశాల అధ్యాపకులు అనీతా మేడం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు



## భవిష్యత్తుకు పునాదులు వేసుకోండి : శ్రీజన గుమ్మల

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



విజ్ఞాన జ్యోతి జూనియర్ కాలేజీ తన విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్న మొదటి వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ఈ ప్రారంభ వేడుకలు సంస్థ యొక్క అకాడెమిక్ శ్రేష్ఠత, సమగ్ర అభివృద్ధి విలువల ఆధారిత విద్యపై ఉన్న నిబద్ధతను ప్రతిబింబించాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా శ్రీమతి శ్రీజన గుమ్మల్ల(ఐఏఎస్) హాజరయ్యారు. వారితో పాటు నిర్వాహక సభ్యులు, సీనియర్ అధ్యాపకులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అకాడెమిక్ సహ-పాఠ్య కార్యక్రమాల్లో విజయాలు సాధించిన మెరిట్ విద్యార్థులను గుర్తించి, పురస్కారాలు అందజేశారు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీజన గుమ్మల్ల, ఐఏఎస్ మాట్లాడుతూ విద్య బాధ్యతాయుతమైన, భవిష్యత్తుకు సిద్ధమైన ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు మొదటి వార్షికోత్సవ వేడుకలు ప్రేరణాత్మకంగా ముగిశాయి. ప్రీ-యూనివర్సిటీ విద్యలో శ్రేష్ఠతపై, ఆత్మవిశ్వాసం, సామర్థ్యం బాధ్యతాయుత విద్యార్థులను పెంపొందించే విజ్ఞాన జ్యోతి జూనియర్ కాలేజీ యొక్క నిబద్ధతను ఇది మరింత బలపరిచింది. కోడే దుర్గాప్రసాద్ ( జనరల్ సెక్రెటరీ విజ్ఞాన జ్యోతి ) పాల్గొని విద్యార్థి విద్యార్థుల ను ఉద్దేశించి ప్రసంగించారు ఈ కార్యక్రమంలో సిహెచ్ అచ్యుత రామ ప్రసాద్, డి ఎన్ రావు శేషగిరిరావు, సృజన, వైజె వెంకట్రావు, ఎ ఆర్ అనురాధ, డాక్టర్ పి. పద్మావతి పాల్గొన్నారు.

## మీరు తెలుసుకోండి, మీ తల్లిదండ్రులకు తెలపండి : సీఐ ప్రభాకర్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :




పశ్చిమ మండల పరిధిలోని మధురానగర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సిఐ) ప్రభాకర్ వారి పై అధికారుల ఉత్తర్వుల మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని మధురానగర్ లో ఓ ప్రైవేట్ కళాశాల లకు శనివారం వెళ్లి సైబర్ నేరాల వలన జరిగే ఇబ్బందులు, వారి బారిన పడకుండా ఎలా ఉండాలో తెలిపే జాగ్రత్త లు కళాశాలలో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. అదేవిధంగా సిఐ ప్రభాకర్ విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ సైబర్ నేరాల గురించి మేము చెప్పిన సూచనలను మీరు తెలుసుకోండి, మీ తల్లిదండ్రులకు తెలపండి అని అన్నారు. వివిధ నేరాల గురించిన ( ఓటిపి వచ్చింది చెప్పమని, ఈ ఖాతా వివరాలు చెప్పమని, మీకు బయటి దేశం నుంచి డబ్బులు వచ్చాయని మళ్లీ వాటికి డబ్బులు కట్టాలని చెప్పే, మీకు లోన్ వచ్చింది పాస్వర్డ్ చెప్పమని, వివిధ రకాల) వాటిని వివరించి వాటి బారిన మీరు పడకుండా మీ తల్లిదండ్రులు పడకుండా ఉండాలని అన్నారు. ఇంటర్నెట్ వాడకంపై నీరు నియంత్రణతో ఉండాలని అన్నారు. సైబర్ నేరాల గురించి ఎటువంటి ఫిర్యాదు చేయాలన్న 1930 కి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుష్మ, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

## కే.శే. గద్దర్ జయంతి వేడుకలను

# ఘనంగా నిర్వహించిన మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్





ఎ ఎం న్యూస్, పటాన్చెరు :

1949 జనవరి 31 మెదక్ జిల్లా తూప్రాన్‌లో జన్మించిన గుమ్మడి విట్టల్ రావు చిన్నతనంలోనే పొలాలలో పాటలు పాడుతూ చిన్ననాటి జీవితాన్ని ప్రారంభించారు. ఆయన మొదట్లో పాడిన పాటల ఆల్బమ్ గద్దర్ పేరుతో మొదలైంది. గద్దర్ అంటే పంజాబీలో విప్లవం అని అర్థం. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు గద్దర్. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో ఆయనది చెరగని ముద్ర. అటువంటి గద్దర్ జయంతి వేడుకలను శనివారం తెల్లాపూర్ చౌరస్తాలో ఉన్న గద్దర్ విగ్రహం వద్ద తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కొల్లూరి భరత్ తండ్రి కొల్లూరి సత్తయ్య సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి గద్దర్ కుమార్తె వెన్నెల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు గద్దర్ విగ్రహం వద్ద వారి కుమార్తె వెన్నెల సమక్షంలో ఘన నివాళులు అర్పించారు కొల్లూరి అమృత సత్తయ్య,వారి కుమారుడు కొల్లూరి భరత్,తో పాటు కార్యక్రమానికి వచ్చిన ముఖ్య అతిథులు, గద్దర్ అభిమానులు, స్థానిక ప్రజలు. గద్దర్ జయంతి వేడుకల సందర్భంగా ఏర్పాటుచేసిన క్రీడలు కు సంబంధించిన విద్యార్థినీ విద్యార్థుల లో గెలుపొందిన వారికి ముఖ్య అతిథులుగా వచ్చిన వారిచే సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కొల్లూరి భరత్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతు న్నాను అన్నారు. గద్దర్ జీవితం, వారు పాడిన పాటలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్ ఉద్యమాలకు ప్రత్యేకత నిలిచాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వందలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులు గా పాల్గొన్న వారు విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు.

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యల మీద చర్యలు తీసుకోవాలి!

ఏ ఎం న్యూస్ ఓయూ :



రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం, కానీ మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఉద్దేశించి ఉపయోగించిన భాష అత్యంత హేయమైనది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన వ్యక్తి ఇలాంటి "బూతు పురాణం" అందుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. అంబటి రాంబాబు వాడిన పదజాలం కేవలం రాజకీయ విమర్శ మాత్రమే కాదు, అది వ్యక్తిగత దూషణ మరియు అసభ్యతతో, సంస్కారహీనమైన భాషతో కూడుకున్నది. ఇది తెలుగు రాజకీయ సంస్కృతిని దిగజార్చేలా ఉంది. ముఖ్యమంత్రి అనే వ్యక్తి ఒక పార్టీకి మాత్రమే కాకుండా, రాష్ట్రం మొత్తానికి ప్రతినిధి. అటువంటి గౌరవనీయమైన పదవిలో ఉన్న వ్యక్తిపై బహిరంగంగా బూతులు మాట్లాడటం వ్యవస్థలను అగౌరవ పరచడమే. ప్రజల మధ్య విద్వేషాలను ప్రేరేపించేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అసభ్య పదజాలంతో మాట్లాడటం చట్టరీత్యా నేరం. సమాజంలో ఇలాంటి ధోరణిని అరికట్టాలంటే, ఇలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. "రాజకీయ నాయకులు మాట్లాడే ప్రతి మాట సమాజంపై ప్రభావం చూపుతుంది. అధికారంలో ఉన్నా లేకపోయినా, భాషలో హుందాతనం పాటించడం కనీస ధర్మం. అంబటి రాంబాబు వ్యాఖ్యలు ముమ్మాటికీ ఖండించదగినవి." ప్రజా స్వామ్యంలో విమర్శకు తావుంది కానీ, విచ్చలవిడితనానికి కాదు. అంబటి రాంబాబు తన వ్యాఖ్య లకు వెంటనే క్షమాపణ చెప్పాలని, అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు సుమోటోగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. రెండేళ్లయినా పిచ్చి కుక్కల్ని ఇంకా మొరగనిస్తున్నందుకు, నీచ నికృష్ట నాయకులను, ఇంకా సమాజంలో తిరగనిస్తున్నందుకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు సరియైన బుద్ధి చెప్పాలని అంబటి రాంబాబు ఖబర్దార్ గండికోట విజయ్ కుమార్ అధ్యక్షులు తార్నాక డివిజన్ తెలుగు దేశం పార్టీ తెలంగాణ

## కూకట్పల్లి జోనల్ కమిషనర్‌తో టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ భేటి..

### నియోజకవర్గ అభివృద్ధిపై బండి రమేష్ చర్చలు..

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను మూసాపేట్ లోని కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులపై రమేష్ ఆయనతో సుదీర్ఘంగా చర్చించారు. రూ 10 కోట్లతో నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు జిహెచ్ఎంసి ఆమోదించింది. ఈ మేరకు పలు డివిజన్ల లో చేపట్టాల్సిన పనులను జనరల్ కమిషనర్ కు రమేష్ వివరించారు. జోనల్ కార్యాలయం నుంచి మూసాపేట చౌరస్తా వరకు రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభించనున్నారు.ఈ సందర్భంగా ఇల్లు స్థలాలు కోల్పోయే వారికి జిహెచ్ఎంసి నుంచి నష్టపరిహారాన్ని త్వరలోనే అందించనున్నట్టు వారు తెలిపారు. భరత్ నగర్ లో నిర్మించనున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ఆంజనేయ నగర్ గోపాల్ నగర్ సిక్స్ ప్లేస్ పార్కుల్లో అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు చేయూత

### - టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :





కూకట్పల్లి నియోజకవర్గం లోని ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్‌కి చెందిన షేగురి జితేష్ రాములుకి లక్ష రూపాయల చెక్కులు మంజూరైనవి. కూకట్పల్లి టిపిసిసి ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్ల మెంట్ ఇంచార్జ్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి బండి రమేష్ శనివారం కూకట్పల్లి నియోజకవర్గం శ్రీ హేమ దుర్గ భవన్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగిరెడ్డి, శివకుమార్ గౌడ్, మస్తాన్ రెడ్డి, శ్రీనివాస్, మహేందర్ ,అస్లాం, కిట్టు, ప్రసన్న, థామస్, విజయలక్ష్మి ,రజిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## బాలాజీ నగర్‌లో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

### ప్రత్యేక పూజలు చేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీ వాసవి మాత దివ్యదర్శనం చేసుకొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులయ్యారు. అనంతరం దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేదాశీర్వచనాలు ప్రసాదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్, సంతోష్, రాజు,జగన్, సంజీవ్ కుమార్, సుబ్బయ్య తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

